www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 28 జనవరి 2025

5

తూర్పుగోదావరి



'స్పర్శ' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి రాజమహేంద్రవరం రూరల్

జాతీయ కుష్టు నివారణ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో సోమవారం 'స్పర్శ' పోస్టర్‌ను ఆర్‌డిఒ సీత రామమూర్తి ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు యాంటీ లెప్రసీ డేగా నిర్వహిస్తున్నారు. జిల్లా టిబి నివారణ అధికారి వసుంధర మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో జనవరి 2, జనవరి 30న గ్రామసభ నిర్వహించి గ్రామస్థాయిలో సర్పంచ్, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు, స్వయం సహాయక బృందాలు, స్వచ్ఛంద సంస్థలు, వార్డు మెంబర్లు, అధికారులు గ్రామాన్ని కుష్టు వ్యాధి రహితంగా మార్చేందుకు అన్ని రకాల కృషి చేయాలన్నారు.

మండలి పోరులో నిలిచేదెవరు?

- పట్టభద్రుల స్థానానికి పెరుగుతున్న పోటీ
- పిడిఎఫ్ అభ్యర్థిగా రాఘవులు ఖరారు
- రసవత్తరంగా మారనున్న ఎన్నికలు

ప్రజాశక్తి – కాకినాడ ప్రతినిధి

శాసనమండలి ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకపోయినా పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీ ఖాయంగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో పలువురు ఆశావహులు బరిలో నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సాధారణ ఎన్నికల తర్వాత జరుగుతున్న మండలి పోరులో నిలిచేదెవరు? అన్న దానిపై ఆసక్తి కనిపిస్తుంది. ఇప్పటికే పిడిఎఫ్ తరుపున ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్, ప్రజా సంఘాలు బలపరిచిన అభ్యర్థిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెవిపి కన్వీనర్ డి.వి.రాఘవులు పేరు ఖరారైంది. పిడిఎఫ్ తరుపున ఆయన పోటీలో నిలుస్తున్నారు. ఆయనతో పాటుగా కూటమి బలపర్చిన టిడిపి నేత పేరాబత్తుల రాజశేఖరం కూడా బరిలో ఉన్నారు. అలాగే కార్పొరేట్ విద్యా సంస్థలకు చెందిన మరికొందరు బరిలోకి దిగే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈసారి జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రసవత్తరంగా మారబోతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను గత డిసెంబర్ 30న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి విడుదల చేశారు. మొత్తం 3,15,261 ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4664, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమలో 64,327, తూర్పుగోదావరిలో 63,441 మంది, ఏలూరు జిల్లాలో 42,602, కాకినాడ జిల్లాలో 70,343, పశ్చిమగోదావరి జిల్లాలో 69,884 మంది ఓటర్లున్నారు. ఆరు జిల్లాల్లోనూ 440 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మార్చి 29 నాటికి ప్రస్తుత ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు పదవి కాలం పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి రెండవ వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యే అవకాశం ఉంది. అలాగే మార్చి 2వ వారంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగొచ్చు. మార్చి 29 లోపే మొత్తం ఎన్నికల ప్రక్రియ ముగిసే అవకాశం ఉంది.

పిడిఎఫ్‌దే హవా...

శాసన మండలి పునర్వ్యవస్థీకరణ తర్వాత తొలిసారిగా 2007లో జరిగిన ఎన్నికల్లో పిడిఎఫ్ తరుపున బరిలోకి దిగిన కచ్చా జార్జివిక్టర్ అనూహ్య విజయం సాధించారు. పట్టభద్రుల స్థానంలో నిలిచిన ఆయన విజయం ఓటర్ల విజ్ఞత నిదర్శనంగా అందరూ పేర్కొన్నారు. నిజాయితీగా ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో ప్రజల పక్షాన నిలిచిన ఎంఎల్‌సిగా విక్టర్ గుర్తింపు పొందారు. జిల్లాలోని ప్రజా సమస్యల్ని, పట్టభద్రుల సమస్యలను శాసనమండలి వేదికగా వినిపించేందుకు ఆయన ప్రయత్నం చేశారు. ఆ తర్వాత 2013లో జరిగిన ఎన్నికల్లో కార్పొరేట్ విద్యాసంస్థల అధినేతగా ఉన్న కె.రవికిరణ్‌వర్మ గెలుపొందారు. అయితే పట్టభద్రుల సమస్యల విషయంలో చొరవ చూపలేకపోయారనే అభిప్రాయం ఆయనపై సర్వత్రా ఏర్పడింది. ఆ తర్వాత 2019లో పట్టభద్రుల స్థానం నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ప్రతినిధి అయిన ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) బరిలోకి దిగి భారీ విజయాన్ని సాధించారు. ఆయన మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే గెలుపొందారు. పట్టభద్రులంతా ఆయన వైపు నిలబడడంతో ఐవి గడచిన కాలంలో అనేక ఉద్యమాలు చేశారు. ప్రధానంగా ఉద్యోగ, ఉపాధ్యాయ నిరుద్యోగ సమస్యలపై శాసన మండలిలో గళమెత్తారు. ముఖ్యంగా సిపిఎస్ రద్దు చేయాలని జరిగిన పోరాటాలలో ముందు నిలబడ్డారు. ప్రభుత్వాన్ని నిలదీశారు.

40 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో...



తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా దిడ్ల వీరరాఘవులను ప్రకటించారు. పిడిఎఫ్ తరుపున బరిలోకి దిగుతున్న ఈయన 40 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. 1984 నుంచి 2024 వరకు టీచరుగా పనిచేశారు. 35 ఏళ్ల పాటు ఉపాధ్యాయ ఉద్యమకారుడుగా పనిచేశారు. పదేళ్లపాటు మండల కార్యదర్శిగా, 12 సంవత్సరాలు ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా, ఐదేళ్ల అధ్యక్షునిగా, రెండు సంవత్సరాలు రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ గా, మరో రెండేళ్లు రాష్ట్ర కార్యదర్శిగా, మూడేళ్ల పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రాష్ట్ర చైర్మన్ గా పని చేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఆయన ఉమ్మడి జిల్లా జెవిపి కన్వీనర్ గా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, అధ్యాపక సంఘాల మద్దతు దండిగా ఉండడంతో ఆయన గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సిపిఎస్ రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదని నినదించారు. కారుణ్య నియామకాల చేపట్టాలని అనేకసార్లు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఉద్యోగుల హక్కుల కోసం పోరాడారు. అంతేకాకుండా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అనేక సమావేశాల్లో మాట్లాడి వాటి పరిష్కారం దిశగా చొరవ చూపారు. ఈ నేపథ్యంలో రాబోవు పట్టభద్రుల ఎన్నికల పట్ల పలువురు ఆసక్తి చూపుతున్నారు.



కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన దీక్షా శిబిరంలో నినదిస్తున్న విఒఎలు

సమస్యలపై విఒఎల నిరసన దీక్ష

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం రూరల్

సమస్యలు పరిష్కరించాలంటూ ఎపి వెలుగు విఒఎ(యానిమేటర్లు)లు సోమవారం కలెక్టరేట్ వద్ద సామూహిక నిరాహార దీక్షకు దిగారు. మూడు రోజుల నిరసన దీక్షలకు రాష్ట్ర వ్యాప్త పిలుపు ఇవ్వడంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీక్షా శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు బి.పవన్, జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుందరబాబు మాట్లాడారు. ప్రతి నెలా జీతం ఇవ్వాల్సిన కనీస బాధ్యతను ప్రభుత్వం నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. ఆరు నెలలుగా జీతం ఇవ్వకుండా పని చేయించుకోవడం వెట్టి చాకిరి కిందకే వస్తుందన్నారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని, మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామంటూ ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 16న సెర్ప్ సిఇఒ సమక్షంలో జరిగిన చర్చలు, నిర్ణయాలు ఇంత వరకు అమలు కాకపోవడం దారుణమన్నారు. అక్రమంగా తొలగించిన విఒఎలను విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును సైతం అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమేనన్నారు. విపరీతమైన పనిభారం పెంచేస్తున్నారన్నారు. మహిళా మార్ట్‌ల్లో బలవంతపు కొనుగోళ్ల వల్ల ప్రజలు, గ్రూపు సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేక వస్తోందన్నారు. అలాగే సమస్యలు పరిష్కారం కోసం జాయింట్ మీటింగ్ ఇంతవరకు ఏర్పాటు చేయలేదన్నారు. గ్రూప్ సభ్యులు అభయహస్తం డబ్బులు వెంటనే చెల్లించాలని తీవ్ర ఒత్తిడి చేస్తున్న విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. విఒఎల దీక్షలకు సిఐటియు పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.బేబిరాణి, మార్త మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమానికి విఒఎల యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.స్వరూపరాణి, కార్యదర్శి ఎన్.మహాలక్ష్మి, హెచ్‌వి.రమాదేవి, మందపాటి సుజాత, కె.గణికమ్మ, విప్పర్తి అర్చన, మందపాటి సత్యవతి, కొవ్వూరు శ్రీదేవి, సూర్యకుమారి, సీతామహాలక్ష్మి తదితరులు నాయకత్వం వహించారు.

నిధుల్లేక నిలిచిన క్లాప్ వాహనాలు

- నగరంలో పేరుకుపోయిన చెత్త
- పారిశుధ్య సమస్య పరిష్కరించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ డిమాండ్



ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం నగరం మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యత తీసుకుని ఇంటింటా చెత్త సేకరణ చేయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. వారం రోజులుగా రాజమహేంద్రవరం నగరంలో ఇంటింటా చెత్త సేకరణ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. దీనితో అందరి ఇళ్లల్లోని చెత్త పెరిగిపోయి దుర్వాసన వస్తున్నాయని అన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా చెత్త సేకరణకు స్వయంభు కంపెనీతో ఒప్పందం చేసుకుందన్నారు. కానీ వారికి నూతన ప్రభుత్వంలో నిధులు చెల్లించక పోవడంతో చెత్త సేకరణ నిలిపివేశారని తెలిపారు. స్వయంభు కంపెనీ ఒప్పందంతో సంబంధం లేకుండా మున్సిపల్ కార్పొరేషన్ చెత్త సేకరణ బాధ్యత తీసుకుని నిర్వహించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్యం నిర్వహణ స్థానిక సంస్థల కనీస బాధ్యతని గుర్తు చేశారు. నగరంలో ఇంటింటా చెత్త సేకరణకు 80 క్లాప్ వెహికల్స్ పని చేస్తున్నాయని అన్నారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి సుమారు కోటి రూపాయలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఈ బకాయిల్ని రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ నిధులు నుంచి విడుదల చేసి మున్సిపల్ కార్పొరేషన్‌పై భారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. క్లాప్ వెహికల్స్ డ్రైవర్స్ కి బకాయి ఉన్న మూడు నెలలు జీతాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. వారం రోజులుగా ఇంటింటికి చెత్త సేకరణ నిలిచిపోవడంతో వీధులన్నీ చేతమయం సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పేపర్‌మిల్లులో అప్రెంటీస్‌కు అవకాశం

ప్రజాశక్తి – కడియం

2024-25 సంవత్సరానికి గాను ఐటిఐ ఫిట్టర్ పాసైన అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ పేపర్ లిమిటెడ్‌కు సంబంధించిన రాజమహేంద్రవరం, కడియం యూనిట్లలో అప్రెంటీస్ కోసం దరఖాస్తులు కోరతున్నారని ఐటిఐ ప్రధానాధికారి ఎల్ఆర్.కృష్ణన్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల నకలు కాపీలు, పాన్, బ్యాంక్ పాస్ బుక్ పేజీ జిరాక్సులతో ప్రభుత్వ ఐటిఐలో ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని ఐటిఐ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సూరిబాబుకు ఘన సత్కారం

ప్రజాశక్తి – పెరవలి

ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న మండలం కానూరు గ్రామ సచివాలయం-1 ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎస్.సూరిబాబును సర్పంచ్ భావనమధు పూర్ణచందు, వార్డు సభ్యులు బూరుగుపల్లి రాజు సోమవారం ఘనంగా సత్కరించారు. సూరిబాబుని ఆదర్శంగా తీసుకొని తోటి ఉద్యోగులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గున్నారు .

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో నైతిక విలువలు

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

విద్యార్థుల్లో నైతిక విలువలతో కూడిన విద్య, శారీరక, మానసిక దఢత్వాన్ని పెంపొందించేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో ఉపయుక్తం అని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు అన్నారు. పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటు కోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయులు ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా తరగతల్లో ఆయన మాట్లడారు. జిల్లా సమగ్ర శిక్ష ఎపిసి ఎస్.సుభాషిణి శిక్షణ తరగతులను పర్యవేక్షించి వివరాలు తెలుసుకున్నారు. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ ఈ తరగతులు నిర్వహిస్తున్నారని జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డి.గౌరీశంకర్రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సిఎంఒ శ్రీనివాస రావు, ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎంవిఎం.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు

మంత్రి పదవి నుంచి నారాయణను తొలగించాలి

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం



అనంతపురం నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ విద్యార్థి మరణానికి కారణమైన నారాయణ సంస్థలను సీజ్ చేయాలని, విద్యార్థి చావుకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారాయణను మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ ఆర్‌జెడి కార్యాలయం వద్ద సోమవారం ధర్నాకు దిగాయి. ఆర్‌జెడి శారదకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా మాట్లాడారు. విద్యార్థి మరణానికి కారణమైన నారాయణ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే వందలాదిమంది విద్యార్థులు చనిపోయినప్పటికీ ఏ జిల్లాలోనూ నారాయణ విద్యాసంస్థలపై కేసు నమోదు కాలేదన్నారు. నారాయణ కార్పొరేట్ విద్యాసంస్థల్లో లక్షల రూపంలో ఫీజులు దోపిడీ చేస్తున్నా చర్యలు లేవన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి మృతి ఘటనపై స్పందించాలని, లేకుంటే ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వై.భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కనక, సహాయకార్యదర్శి కె.జ్యోతిర్మయి, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు కె.భానుప్రసాద్, సిటీ కార్యదర్శి దినేష్, పిడిఎస్‌యు నాయకులు సతీష్, రోహిత్, మణికంఠ, ఎస్ఎఫ్ఐ నాయకులు సాహితి, శివ బాలాజీ, తేజ, సౌమ్య, మౌళి, ప్రసన్న, ధరణి, తనుజ, దివ్య, చింటూ, స్వామి ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ పవన్ మృతికి సంతాపం

ప్రజాశక్తి – సీతానగరం

సీతానగరం-2 సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ కోన పవన్‌కుమార్(30) ఆదివారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందారు. పవన్ కుమార్ మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. కోరుకొండ మండలం జంబూపట్నం గ్రామానికి చెందిన పవన్‌కుమార్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా సీతానగరం సచివాలయం-2లో విధులు నిర్వహిస్తున్నారు. మృతునికి తల్లి, సోదరుడు ఉన్నారు. ఆదివారం తన స్వగ్రామం వెళ్లకుండా ఆయన సీతానగరంలో ఉండిపోయారు. ఆదివారం ఉదయం 4 గంటలకు కడుపునొప్పితో బాధపడుతూ వాంతులు చేసుకుని అపస్మారక స్థితికి చేరడంతో స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణం విడిచాడని సచివాలయ సిబ్బంది తెలిపారు.

అర్జీపై క్షేత్ర స్థాయిలో కలెక్టర్ విచారణ

ప్రజాశక్తి – పెరవలి

మండలం కాకరపర్రు గోదావరి పరివాహక లంక భూములు డి.ఫామ్ పట్టా, లంక భూములు తమ వారసులకు పట్టాలు పంపిణీ చేయాలని వారసులు ద్వారా ఇచ్చిన వినతి మేరకు సోమవారం మధ్యాహ్నం జెసి ఎస్.చిన్నరాముడుతో కలిసి కలెక్టర్ పి.ప్రశాంతి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు. గోదావరి లంకలో పర్యటించారు. అర్జీలో పేర్కొన్న సర్వే 60, 61 నెంబర్లలో పంట భూములను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధించిన పట్టా భూములు వారసుల వివరాలతో సమగ్ర నివేదిక అందించాలని తహశీల్దార్ డి.అచ్యుత కుమారి, మండల సర్వే అధికారి శేషకుమార్‌ని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి, జిల్లా మైన్స్ అధికారి ఫణిభూషణ్‌రెడ్డి, జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ఉన్నారు

ఉద్యోగ భద్రత, ప్రాణ రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి – పెరవలి

ఉద్యోగ భద్రత కల్పించాలని మండల గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వెంకటరమణకు సోమవారం వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో కర్నూలు జిల్లా ఆలూరు మండలం అరికల్ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ కురమ వీరన్న 24న విధులు పూర్తి చేసుకొని ఇంటికి వస్తూ ఉండగా దుండగులు దాడిలో మరణించారన్నారు. మృతుని కుటుంబాన్ని ఆదుకొని ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రాణ రక్షణ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో లక్ష్మీ, నరేష్, రాంబాబు, సత్యనారాయణ, దుర్గాప్రసాద్, బాబూరావు, నాగరాజు, తదితరులు ఉన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే ఉపేక్షించేది లేదు

ప్రజాశక్తి –కడియం

గ్రామాల్లో అభివృద్ధిని అడ్డుకుంటే ఉపేక్షించేది లేదని రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. సోమవారం దుళ్ల గ్రామంలో అసంపూర్తిగా నిలిచిపోయిన వాటర్ ట్యాంక్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలందరికీ మంచినీటి సమస్య తీర్చే విధంగా రూ.59 లక్షలతో ప్రారంభించిన వాటర్ ట్యాంక్ పనులపై కొంతమంది కోర్టుకు వెళ్లడం వల్ల నిర్మాణం ఆగిపోయిందన్నారు. ఇప్పటికే ట్యాంక్ పరిధిలో పైపులైన్ ఏర్పాటు చేసి 240 ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను దష్టిలో ఉంచుకొని, సత్వరమే యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, కూటమి నాయకులు ముమ్మిడి దేవినాగేశ్వరరావు, గుర్రపు సత్యనారాయణ, చిట్టూరి అమ్మిరాజు, సూరపురెడ్డి భరత్‌కుమార్, మెర్ల అయ్యప్ప, కాయల సత్యనారాయణ, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి


విశిష్ట సేవలకు గుర్తింపు

ప్రజాశక్తి –దేవరపల్లి



దేవరపల్లి మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మాజీ అధ్యక్షులు, రాష్ట్ర మానవత కన్వీనర్ బలుసు సత్యనారాయణ చేసిన విశిష్ట సేవలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రశంసాపత్రం అందించింది. గణతంత్రవేడుకల్లో కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా ఆయన దీన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ మానవత సంస్థ వ్యవస్థాపకులు ఎన్.రామ చంద్రరెడ్డి ఆశయాలకు అనుగుణంగా సేవలు అఅందిస్తున్నామని తెలిపారు.

కార్టూ'నిజం'



పంట కాలువ ఆక్రమణ

రైతుల ఇబ్బందులు


ప్రజాశక్తి – కడియం

ఆలమూరు మండలం మడికి నుంచి కడియం మండలం దుళ్ల గ్రామం మీదుగా మండపేట మండలం ఏడిద వరకు ప్రవహించే పంట కాలువ కొన్నేళ్లుగా ఆక్రమణలకు గురవుతోంది. ఆక్రమణల కారణంగా సాగునీరు సరిగా పారట్లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఇదే పరిస్థితి ఉన్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవట్లేదని దుళ్ల రైతులు వాపోతున్నారు.

పంట కాలువ పూడికతీతలో భాగంగా ఏడిద గ్రామంలో మొదలు పెట్టిన పనులు ప్రస్తుతం దుళ్ల గ్రామంలో జరుగుతున్నాయి. విషయం తెలుసుకున్న రైతులు అక్కడకు చేరుకున్నారు. కాలువ ఆక్రమణలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పంట కాలువపై కొన్ని వందల ఎకరాలు సాగవుతున్నాయని తెలిపారు. ఆక్రమణల కారణంగా నీటి ప్రవాహం క్రమేపి తగ్గుతూ వస్తుందన్నారు. ఆక్రమణలు ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో కాలువ మరింత కుచించుకుపోయి నీటి ఎద్దడితో ఏటా నష్టాలను చూడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్వం గ్రామంలోని మహిళలు ఈ కాలువలో కార్తీకమాసం సమయంలో స్నానాలు చేసి పూజాదికాలు నిర్వహించేవారని, అలాంటిది ప్రస్తుతం కాలువలో కాలు పెట్టలేని పరిస్థితి ఏర్పడిందని వారు తెలిపారు. కాలువ దుళ్ల గ్రామంలో నివాసాల చెంత నుంచి ప్రవహించడంతో పరిస్థితులు మరింత దారుణంగా ఉన్నాయన్నారు. కొందరు స్థానికులు తమ ఇళ్లలోని మురుగునీరు, వ్యర్థాలను నేరుగా కాలువలోకి వదిలేస్తున్నారని తెలిపారు. ఫలితంగా కాలువనీరు కలుషితమవుతుందని, దుర్వాసనవస్తుందని మురుగుకాలువ కన్నా దారుణంగా తయారైందని రైతులు చెబుతున్నారు. గుడులు, గోపురాలు, విగ్రహాలకు తోడు, కొందరు మోతుబరులు కాలువను ఆక్రమించి తమ కార్లకు షెడ్డులను సైతం నిర్మించుకున్నారని, దీనితో కాలువలో తీసిన పూడిక ఎక్కడ వేయాలో తెలీక గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో బయటకు తరలిస్తున్నారు. ఇలాంటి వాటిపై సంబంధిత అధికారులు, స్పందించి ఆక్రమణలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.



యంత్రాలతో నిర్వహిస్తున్న పూడిక తీత



పంట కాలువను ఆక్రమించి నిర్మించిన షెడ్డు

స్థానిక నివాసితులు ఆవేదన..

పంట కాలువ ఆక్రమణల వల్ల సాగు నీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు తమగోడు వినిపిస్తుంటే... కాలువను ఆనుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్న స్థానికులు వారి సమస్యలను ఏకరువు పెడుతున్నారు. స్థానికులు కంటిపూడి సాయి, కట్టుంగ నాగరాజు, మాదారపు నాగవేణి తదితరులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కాలువ పూడికతీత పేరుతో వచ్చిన మట్టి, వ్యర్థాలను తమ ఇళ్లకు ఆనుకుని నిల్వ చేస్తున్నారన్నారు. దీనితో తీవ్ర దుర్వాసనతో రోజులు తరబడి ఇబ్బందులు పడుతున్నామన్నారు. దోమలకు ఆవాశాలుగా మారడంతో విష జ్వరాల బారిన పడుతున్నామని తెలిపారు. పదిహేను ఏళ్లుగా ఏటా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నామన్నారు. కాలువకు మరోవైపు దుళ్ల బైపాస్ రోడ్డు వుందని, రోడ్డు మార్జిన్ కాళీగా ఉంటుందని అటు వైపు మాత్రం వ్యర్థాలను డంప్ చేయట్లేదన్నారు. అధికారులు తమపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణదారులకు, మోతుబరులకు కొమ్ముకాస్తూ తమ పట్ల అన్యాయంగా ప్రవర్తించడం తగదని వారంటున్నారు. తమ ఇళ్ల వద్ద నిల్వచేసిన బురద మట్టి, వ్యర్థాలను వెంటనే తొలగించాలని, అలాగే ఆక్రమణలు కూడా తొలగించాలని, దీనికి తాము స్వచ్ఛందంగా సహకరిస్తామని తెలియజేస్తున్నారు.



ఇళ్ల చెంతనే వేసేసిన సిల్టు

పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

రూ.2 లక్షల ప్రభుత్వ నిధులతో కాలువ పూడికతీత పనులు చేపట్టాం. 6.25 కిలోమీటర్ల మేర కాలువ ప్రవహిస్తుంది. 1,921 ఎకరాల పంట భూములకు సాగు నీరు అందుతుంది. ఆక్రమణలపై దుళ్ల పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తీసిన పూడిక కాలువ గట్టు పైనే వేస్తున్నాం.

- ఇరిగేషన్ ఎఇఇ త్రిమూర్తులు

నేరాలు ఘోరాలు

ఇద్దరు వ్యక్తుల అరెస్టు

ప్రజాశక్తి - కోటనందూరు

వేర్వేరు కేసుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సిఐ జి.చెన్నకేశవరావు, ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. గత శుక్రవారం బిళ్ళనందూరు గ్రామానికి చెందిన మాతిరెడ్డి గంగయ్యమ్మ ఉపాధి కూలీ పనికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చేటప్పటికి ఇంటి తలుపులు పగలకొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూస్తే బీరువా పగిలిపోయి ఉంది. బీరువాలో దాచిన 100 గ్రాముల బంగారు ఆభరణలో చోరీకి గురియైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా సోమవారం తాటిపాక సెంటర్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా అదే గ్రామానికి చెందిన బొత్స వీరబాబు వద్ద బంగారు ఆభరణాలు లభించాయి. అదే గ్రామంలో ఇద్దరు అన్నదమ్ములు మిరియాల నాగు, మిరియాల నానాజీ మధ్య జరిగిన చిన్నపాటి వివాదంలో జరిగింది. దీంతో తమ్ముడు నానాజీని కర్రతో దాడి చేశాడు. ఈ కేసులో మిరియాల నాగును అరెస్టు చేసినట్లు వారు తెలిపారు.

మెడికల్ షాపులో రూ.2 లక్షల చోరీ

ప్రజాశక్తి - కడియం

మండలంలోని జేగురుపాడు గ్రామ పంచాయతీ కాంప్లెక్స్‌లో ఉన్న సతీష్ మెడికల్ అండ్ జనరల్ షాపు తాళాలు పగలుగొట్టి రూ.2 లక్షల నగదును గుర్తి తెలియని వ్యక్తులు దొంగిలించుకు పోయారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని దుళ్ల గ్రామానికి చెందిన గుంటూరి సతీష్ జేగురుపాడులో కొన్నేళ్లుగా మెడికల్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఒక వ్యక్తికి రూ.2లక్షల నగదు ఇవ్వాల్సి ఉండటంతో ఆ మొత్తాన్ని షాపులోనే ఉంచాడు. రాత్రి షాపు కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు వచ్చి చూసేసరికి షాపు తాళాలు పగలు గొట్టి ఉండటాన్ని గమనించాడు. వెంటనే లోపలకి వెళ్ల చూడగా రూ.2లక్షలు మాయమైనట్టు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. కడియం క్రైం హెడ్ కానిస్టేబుల్ ఎం.సురేష్ ఆధ్వర్యంలో క్లూస్ టీమ్ ఘటనా స్థలాన్ని సోమవారం పరిశీలించింది. దగ్గరలోని మరో షాపులోనూ చోరీకి విఫలయత్నం చేసినట్టు గుర్తించారు. సమీపంలోని ఒక పశువుల షెడ్డు వద్ద ఉన్న సిసి కెమెరాలను సైతం దుండగులు పగులగొట్టినట్టు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసును నమోదు చేశారు.


వృద్ధులకు పండ్లు పంచుతున్న రీజెన్సీ సంస్థ సిబ్బంది

చంద్రశేఖర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

రీజెన్సీ సిరామిక్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్, రీజెన్సీ విద్యాసంస్థల వైస్ ఛైర్మెన్ కెసి.చంద్రశేఖర్‌కు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం చంద్రశేఖర్ 13వ వర్ధంతి స్థానిక రీజెన్సీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు మాట్లాడారు. అలాగే ఓల్డ్ ఏజ్ హోంలో ఉన్న ఆయన విగ్రహానికి నివాళులర్పించి, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రీజెన్సీ స్కూల్ హెచ్‌ఎం టివిఎస్ఎస్‌వి.ప్రసాద్‌రావు, ప్రిన్సిపల్ మార్తాండ ప్రసాద్, చింతా వెంకట్, చింతా కొండలరావు, రాజేంద్రప్రసాద్, ప్రభాకర్, ప్రసాద్, సిహెచ్ వీరభద్రరావు పాల్గొన్నారు.

నేడు లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు గ్రామంలో మంగళవారం పశు గణాభివృద్ధి సంస్థ ద్వారా పశువైద్యశాల వద్ద లేగ దూడల అందాల ప్రదర్శన, పెంపకంపై అవగాహనా కార్యక్రమం నిర్విస్తున్నట్లు పశు వైద్యులు డాక్టర్ యు.ముకేష్ తెలిపారు. పాడి రైతులు తమ దూడలతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుష్టు బాధితులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - కడియం

మండలంలోని కడియపులంక 'శ్రీ ప్రగతి విద్యానికేతన్' కరస్పాండెంట్ కర్రి యోహాన్ పుట్టినరోజును పురస్కరించుకొని కుష్టు బాధితులకు దుప్పట్లు అందజేశారు. సోమవారం ఆయన మాధవరాయుడు పాలెం పంచాయతీ శివారు చైతన్య నగర్ సమీపానగల లెప్రర్సీ కాలనీకి వెళ్లి అక్కడ గల రోగులకు దుప్పట్లు అందజేశారు. వారికి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యోహాను మాట్లాడుతూ వైకల్యం కలిగిన వారి పట్ల, రోగుల పట్ల చిన్న చూపు తగదన్నారు. తమ విద్యాసంస్థలో కొంతమంది పేద విద్యార్థులకు నామ మాత్రపు ఫీజుతో విద్యను అందిస్తున్నామన్నారు.


థామస్‌కు నివాళులర్పిస్తున్న ఎలక్ట్రీషియన్లు

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం...

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారమవుతాయని,ఆయా సంఘాలు అభివృద్ధి చెందుతాయని పలువురు వక్తలు అన్నారు. ఎలక్ట్రీషియన్స్ డే సందర్భంగా సోమవారం తాళ్లపూడి మండల ఎలక్ట్రిషన అండ్ ప్లంబర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో థామస్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎలుబోలు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పశ్చిమగోదావరి జిల్లా ఎలక్ట్రిషన్ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు శీలబోయిన శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎలక్ట్రిషన్ డే జనవరి 27వ తారీఖున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ప్రసాద్, సురేష్, పోసియ్య, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ వసతిగృహాల పరిశీలన

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం మండలంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాలను జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎంఎస్.శోభారాణి, పంచాయతీరాజ్ అధికారులు సోమవారం పరిశీలించారు. శోభారాణి మాట్లాడుతూ నియోజకవర్గంలో 10 సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాలు ఉన్నాయన్నారు. వసతిగృహాలకు మరమ్మతులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,44,84,000 నిధులు మంజూ చేసిందన్నారు. గోపాలపురం బాలుర వసతి గృహానికి రూ.23.51లక్షలు, రాజంపాలెం బాలికల వసతి గృహానికి రూ.10.65 లక్షలు, రేగులకుంట బాలురు వసతిగృహానికి రూ.9.62లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.వెంకటలక్ష్మి, పిఆర్ఎఇ జి.పవన్, దేవరపల్లి ఎఎస్‌డబ్ల్యూ ఆర్‌వి.శ్రీనివాస్, సచివాలయం సిబ్బందితో కలిసి వసతి గృహాలను పరిశీలించామన్నారు. విడుదలైన నిధులతో ఎలాంటి పనులు చేపట్టాలో కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. గోపాలపురం వసతిగృహం పూర్తిగా శిథిలమైనట్టు గుర్తించారు. దీనిపై పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, ఉన్నతాధికారులతో చర్చించి నివేదికను కలెక్టర్‌కు అందిస్తామన్నారు.


హాస్టల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మిగిలిన రోడ్ల సంగతేంటి?

ప్రజాశక్తి - కడియం

ఆక్రమణదారుల చెరలో చిక్కుకున్న కడియం పడాల వారి వీధికి ఎట్టకేలకు మోక్షం లభించింది. దశబ్దాల కాలంగా నరకయాత్ర చూస్తున్న ఆ ప్రాంత వాసులు పట్టిన ఉడుం పట్టుకు అధికారులు తలొగ్గారు. ఏదో తూ తూ మంత్రపు తొలగింపులతో పని కానిద్దామని భావించినా... ఆ ప్రాంతవాసుల న్యాయమైన కోరిక మేరకు కార్యదర్శి ఎన్.శ్రీనివాస్ రెడ్డి ఆక్రమణలు పూర్తిగా తొలగింపజేశారు. దీంతో ఆ ప్రాంతవాసులు కార్యదర్శిని అభినందనలతో ముంచెత్తుతున్నారు. అయితే ఇదే దుందుడుకుని ప్రదర్శిస్తూ కెనాల్ రోడ్, హై స్కూల్ రోడ్, సినిమా రోడ్డుల్లోని ఆక్రమణలను తొలగించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని, అలాగే గ్రామంలో అడ్డు అదుపు లేకుండా జరుగుతున్న నిర్మాణాల పట్ల ఒక కన్నేసి చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

పలుచోట్ల పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం దారవరంలో పశు వైద్యులు డాక్టర్ యు.ముఖేష్ ఆధ్వర్యంలో సోమవారం పశువైద శిబిరాన్ని నిర్వహించారు. 64 పశువులకు, 38 దూడలకు, 112 కోళ్లకు నట్టల నివారణ మందులు వేశారు. లంపి చర్మ వ్యాధి సోకకుండా 42పశువులకు, గొంతువాపు వ్యాధి రాకుండా 134పశువులకు, కొక్కెర వ్యాధి రాకుండా 120 కోళ్లకు నివారణ టీకాలు వేశామన్నారు. పశు వులకు బాహ్య పరాన్న జీవుల నిర్మూలన, గర్భకోశ వ్యాధుల చికిత్స -18 చూడు పరీక్షలు- 13 చేసినట్లు ఆయన తెలిపారు . పశువైద్య శిబిరంలో 42 మంది పాడిరైతులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్య్రక్రమంలో సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్, టిడిపి మండల నాయకులు బొడ్డు రాజు, గ్రామ పెద్దలు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : మండలం రఘుదేవపురంలో సోమవారం మండల పశు వైద్య అధికారి డాక్టర్ ఫణీంద్ర ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఫణీంద్ర పాడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వివిధ వ్యాధులు రాకుండా నివారణా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నయకులు పెందుర్తి భాస్కరరావు, దాసరి రమేష్, కవల గంగాధర్, చంద్రు సత్యప్రసాద్, తన్నీరు సుబ్బారావు, ఉండవల్లి తాతారావు, విఎ మునీంద్ర, ఎహెచ్‌ఎలు సుధాకర్, గీతిక, వెంకటేశ్వర్లు, చిట్టిబాబు, గోపాల్ మిత్ర రామాచారి పాల్గొన్నారు.


మురళీమోహన్‌కు నివాళులర్పిస్తున్న కార్మికులు, కుటుంబ సభ్యులు

కార్మిక నేత మురళీమోహన్‌కు నివాళి

ప్రజాశక్తి - యానాం

స్థానిక రీజెన్సీ కార్మిక యూనియన్ నేత మచ్చా మురళీమోహన్ 13వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఫ్యాక్టరీ గేటు వద్ద కార్మికులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ నాయకులు బి.సూర్యభగవాన్, ఎవివి. సత్యనారాయణ, సాంబశివరావు, గుదే దుర్గాప్రసాద్ మాట్లాడారు. 2012 జనవరి 27న మురళీమోహన్ మృతి చెందారని, నేటి వరకు ప్రభుత్వం ఆ కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రీజెన్సీ తెరిపించడానికి నియోజకవర్గ రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. రీజెన్సీ యాజమాన్యం కార్మికులకు కేటాయించిన స్థలాలను అందజేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మురళీమోహన్ సతీమణి దుర్గ, వారి కుటుంబ సభ్యులతోపాటు, ప్రసాద్‌రాజు, వర్మ, రామేశ్వరరావు, మురళీమోహన్, దుర్గయ్, కార్ముకులు పాల్గొన్నారు.

నేడు పింఛను దారుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ప్రజాశక్తి - పెరవలి

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్స్ పథకంలో హెల్త్ పెన్షన్స్‌కు సంబంధించి లబ్ధిదారుల హెల్త్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం మంగళవారం మండలంలో అన్ని గ్రామాల్లో జరుగుతుందని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సిహెచ్.వెంకటరమణ తెలిపారు ప్రస్తుతం మండలంలో 123 హెల్త్ పింఛనుదారులు ఉన్నారని, వారంతా వెరిఫికేషన్‌కు అందుబాటులో ఉండాలన్నారు. లేకుంటే పింఛన్‌ను హోల్డ్‌లో పెడతారన్నారు.

పిజిఆర్‌కు ఒక దరఖాస్తు

ప్రజాశక్తి - పెరవలి

తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ డి.అచ్యుతకుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు ఒక దరఖాస్తు వచ్చింది. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సిహెచ్.వెంకటరమణ, ఎలక్ట్రికల్ ఎఇ డేవిడ్ నిశ్చల్, వర్క్ఇన్‌స్పెక్టర్ జోగారావు, ఎపిఎం రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దావోస్ పర్యటనతో రాష్ట్రానికి పెట్టుబడుల వరద

మీడియా సమావేశంలో ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

దావోస్ పర్యటనతో రాష్ట్రానికి పెట్టుబడుల వరద పారనుందని, తమ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లను చూసి వైసిపి నాయకులు చూసినేర్చుకోవాలని ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసిపి పాలనలో దావోస్‌లో ఎకనామిక్ ఫోరమ్ మీట్‌కి సైతం వెళ్లలేని పరిస్థితులు చూశామన్నారు. నేడు చంద్రబాబు, లోకేష్, టిజి భరత్ టీమ్ నాలుగు రోజుల దావోస్ పర్యటన ఎలా విజయవంతం అయ్యిందో చూశామన్నారు. పక్కాగా పెట్టుబడులు వచ్చే విధంగా వారు కృషి చేశారన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం..

ప్రజాశక్తి - తాళ్లపూడి

రిపబ్లిక్ డే రోజున ఉత్తమ అవార్డులు అందుకున్న తాళ్లపూడి మండలానికి ఎంపిడిఒ రమణ, గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావులను కార్యాలయ సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిపి జొన్నకూటి పోసిరాజు హాజరై మాట్లాడారు. ఉద్యోగులు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించి మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవీంద్రనాథ్, ఇఒపిఆర్‌డి వీరన్న, కూటమి నాయకులు నక్కా చిట్టిబాబు కార్యాలయ, సచివాలయ, పంచాయతీ శాఖ సిబ్బంది పాల్గొని అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే

ప్రజాశక్తి-గోకవరం

గోకవరంలో యునైటెడ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్‌పిటిసి మాజీ సభ్యులు పాలూరి బోసుబాబు హాజరై మాట్లాడారు. ఎలక్ట్రీషియన్ వత్తి ఎంతో ప్రాముఖ్యమైనదని దానిని అందరూ సమాజానికి ఉపయోగపడేలాగా కాపాడుకుంటూ సమాజాభివద్ధికి, ఆర్థికంగా అభివద్ధికి తోడ్పడేలాగా కషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యవర్గసభ్యులు, ఎలక్ట్రిషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎఒగా సుబ్రహ్మణ్యం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గా కూరెళ్ల సుబ్రహ్మణ్యం సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన రంగంపేట ఎంపిడిఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించారు. ఉద్యోగోన్నతిపై సీతానగరం వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ అధికారుల ఆదేశాల మేరకు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

దళితుల శ్మశానంలో నిర్మాణాలు తగదు


ప్రజాశక్తి - రాజానగరం

రంగంపేట మండలం పి.కోటపాడులో దళితుల శ్మశాన వాటికలో అక్రమ నిర్మాణాలు తగదని, ఈ పనులకు అనుమతులు మంజూరు చేస్తే ఆందోళనకు దిగాల్సి వస్తుందని దళిత సంఘాలు హెచ్చరించాయి. దీనిపై జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సంఘాల నాయకులు, గ్రామస్తులు అర్జీ అందజేశారు. అనంతరం రాష్ట్ర చైర్మన్ కుందేటి వెంకటరమణ, చంద్రమల్ల వాడపల్లి, చంద్ర మల్ల రమణ, వేణుబాబు, తాతపూడి సత్తయ్య తదితరులు మాట్లాడారు. గ్రామానికి చెందిన రెండు ఎకరాల 71 సెంట్ల భూమి తమ పూర్వీకుల నుంచి శ్మశాన వాటికగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు ఈ స్థలంలో గ్రామానికి చెందిన కొందరు ప్రభుత్వ పాఠశాలకు తరగతి గదుల నిర్మాణం, ఆట స్థలానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. గతంలో శ్మశాన వాటికలో నిర్మాణాలు చేపట్టకూడదు సుప్రీంకోర్టు చెప్పిందని తెలిపారు. అధికారులు ఈ ప్రయత్నాలు మానుకోవాలని కోరారు. లేకుంటే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు.

రూ.70.55 కోట్ల మద్యం విక్రయాలు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు ఐఎంఎఫ్ఎల్ డిపో పరిధిలో 111 దుకాణాలు ఉన్నాయని, వీటిలో ఈ నెల ఒకటో తేదీ నుంచి 25వరకూ రూ.70.55 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయని జిల్లా డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ వై.చైతన్యమురళి అన్నారు. చాగల్లులోని ఎపి బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఐఎంఎఫ్ఎల్ డిపోను ఆయన సోమవారం పరిశీలించారు. డిపోలోని సరుకు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు, అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు డిపో పరిధిలో పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట డిపో మేనేజర్ రామకృష్ణదాసు సిబ్బంది తదితరులు ఉన్నారు


డిపోను తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ చైతన్యమురళి

ఎంపిడిఒ గోవిందుకు పలువురి అభినందన

ప్రజాశక్తి-గోకవరం

కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న ఎంపిడిఒ ఎం.గోవిందును పలువురు టిడిపి నాయకులు అభినందించారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ గోవిందును టిడిపి నాయకులు శాలువాతో సత్కరించారు. బొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ గోవిందుకు అవార్డు రావడం హర్షణీయమన్నారు. తొమ్మిది సార్లు జిల్లా స్థాయిలో అవార్డులు రావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ ఉపాధ్యక్షులు పాలాడి శ్రీనివాసరావు, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు మోర్త చిట్టిబాబు, నాయకులు గున్నూరి లాజరు, రిటైర్డ్ ఏఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ధాన్యం సొమ్ములు ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి -గోకవరం

ధాన్యం సొమ్ములు ఇప్పించాలంటూ మండలంలోని తిరుమలాయపాలెం రెవెన్యూ పరిధి గంగంపాలెం రైతులు సోమవారం తహశీల్దార్ సాయిప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ డిసెంబర్ 18న రైతు భరోసా కేంద్రంలో 1,200 క్వింటాలు ధాన్యం అమ్మామని తెలిపారు. నేఇటకీ సొమ్ములు ఇవ్వలేదని తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారులను అడుగుతుంటే రేపు, మాపు అంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారన్నారు.

ఆర్ఐ సత్యేంద్రకుమార్‌కు అభినందన

ప్రజాశక్తి - నిడదవోలు

ఉత్తమ అవార్డు గ్రహీత నిడదవోలు తహశీల్దార్ కార్యాలయం ఆర్ఐ బి.సత్యేంద్రకుమార్‌కు పలువురు అభినందనలు తెలిపారు. కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు జువ్వల రాంబాబు, మాజీ ఎంపిపి సూరిబాబు, బిటిఎ రాష్ట్ర కార్యదర్శి నేతల విజయ్ కుమార్, భయమనేంద్ర, బిఎస్‌పి నాయకులు బయ్యే మునీంద్ర, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మత్తె అర్జునుడు, అక్కాబత్తుల క్రిస్టియన్‌రావు, పి.చినబాబు, విఆర్ఒ అయినపర్తి శ్రీనివాస్, మెంటే వెంకటేశ్వరరావు, హ్యూమన్ రైట్స్ తూర్పుగోదావరి జిల్లా అసోసియేషన్ చైర్మన్ కురసాల పురుషోత్తం, వి.ప్రభాకర్, కె.సురేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


భువనేశ్వరి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

భువనేశ్వరి కుటుంబానికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని కొత్తపల్లి ఎంపిటిసి సభ్యులు ముదిలి భువనేశ్వరి కుటంబాన్ని సోమవారం పలువురు పరామర్శించారు. ఇటీవల భువనేశ్వరి అకాల మరణం పొందని విషయం విదితమే. ఎంపిపి సుంకర శ్రీవల్లి,వీరబాబు దంపతులు జడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీరంగ, రమేష్, వైస్ ఎంపిపి మడికి మైనర్‌బాబు, ఎంపిటిసి సభ్యులు కోటసత్యవతి, నాయకుల సూరిబాబు, కో ఆప్షన్ మెంబరు మీరాభి చంటి, ఎంటిపి అసిరమ్మ, యేసురత్నం పరామర్శించారు. భువనేశ్వరి మృతికి సంతాపాన్ని వ్యక్తంచేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతిని ప్రకటించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కడియం

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజమహేంద్రవరం సౌత్ జోన్ డిఎస్‌పి భవ్యకిశోర్ ప్రజలకు సూచించారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ రూల్స్, మాదకద్రవ్యాలు, నేరాల నిరోధనకై సీసీ కెమెరాలు, ఎల్ హెచ్ ఎం ఎస్ కెమెరాలు తదితర అంశాలపై మండలం లోని జేగురుపాడు గ్రామంలో సోమవారం రాత్రి అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భడి డిఎస్‌పి మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నాం అంటే ఒటిపి చెప్పరాదన్నారు. ఏదైనా సమస్యలుంటే నేరుగా బ్యాంకుకు వెళ్లి తెలుసుకోవాలన్నారు. గ్రామాల ప్రధాన కూడలిలో సీసీ కెమెరా ఏర్పాటు చేయాల న్నారు. ఎవరైనా ఊళ్లకు వెళ్లినట్లయితే ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు.

పద్మశ్రీ అవార్డు పట్ల హర్షం

తాళ్లపూడి : ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ పద్మశ్రీ అవార్డుకు ఎంపిక కావడంపై పైడిమెట్లలో జగ్జీవన్‌రామ్ సమైక్య నాయకులు హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.